## పెద్ద కథ :




(గత సంచిక తరువాయి)

"ఇక్కడ ఎంత అందంగా వుందండీ. మన పాపను అలా వదిలేస్తే ఈచెట్ల కింద ఎంత హాయిగా ఆడుకుంటుందో!" కండలేని సరస్వతి చెక్కిళ్ళు చిరునవ్వులా ముడుతలు పడ్డాయి.

"ఔను," అన్నాడు తాను.

"అలాగైతే ఒకసారి తీసుకురారూ పాపను." ఉద్రేకంగా అన్నది సరస్వతి.

"అలాగే అన్నాడు. తాను.

మరుసటి రోజే చౌదరికి వుత్తరం వ్రాశాడు.

ఆ రోజునుంచే సరస్వతికి క్షణమొక యుగమైపోయింది.

పది రోజుల తరువాత చౌదరి, రాజేశ్వరమ్మ పాపను తీసుకొని శానటోరియం వచ్చారు.

రాజేశ్వరమ్మ సంగతి తెలిసిన సరస్వతి చాలా బాధపడింది.

కానీ పాప సాన్నిధ్యంలో తన జబ్బును, రాజేశ్వరమ్మ బాధను మరిచిపోయింది.

డాక్టర్లు ఎంత వారించినా వినకుండా, బెడ్ మీద లేచి కూర్చుంది. రాజేశ్వరమ్మ పాపను ఆడిస్తుంటే ఒళ్ళు మరచిపోయింది.

కానీ.... రాజేశ్వరమ్మ పాపకు అన్నం పెట్టటం, నాలుక నాలుకతో తాకి పాపను నవ్వించటం తనకు జుగుప్సాకరంగా వుండేది.

మాటలు వచ్చీరాని పాప- "ఆడ, ఈడ." అంటుంటే తనకు కర్ణకఠోరమనిపించేది.

కానీ సరస్వతికిమాత్రం అవేవీ అసహ్యమనిపించలేదు....

"తనకు పిల్లలు కలగరని తెలిసినప్పటి నుంచీ, రాజేశ్వరికి పాపతో అనుబంధం ఎక్కువైపోయింది", అన్నాడు చౌదరి ఆనాటి రాత్రి.

ఆ పరిణామం సహజమే అయినా తనకెందుకో నచ్చలేదు.

రెండురోజుల తరువాత పాపతోబాటు చౌదరి, రాజేశ్వరమ్మ వెళ్ళిపోయారు.

ఆరునెలల్లో వెళ్ళిపోవచ్చు ననుకున్న సరస్వతి నాలుగు సంవత్సరాలు శానటోరియంలో వుండిపోవలసి వచ్చింది.

ఈలోగా వ్యాపార కారణాలవల్ల చౌదరి కుటుంబం బొంబాయిలోస్థిరపడిపోయింది.

ఈ నాలుగు సంవత్సరాల్లో పాపను చూసే అవకాశమే తమకు లేకపోయింది.

తరువాత ఒకసారి సరస్వతి పాపను చూడాలంటే ఆ విషయం చౌదరికి రాశాడు తాను.

వారం రోజులు దాటకుండా నాలుగు వందల రూపాయలతోబాటు ఆహ్వానం అందింది. తామిద్దరూ రెక్కలు కట్టుకొని బొంబాయికి వెళ్ళారు.

బొంబాయి ప్రయాణంతో సరస్వతికి పాత జబ్బుకుతోడు మరో కొత్త జబ్బు వచ్చింది.

అందుకు కారణం రాజేశ్వరమ్మకు పాపకు మధ్య పెరిగిపోయిన అనుబంధాన్ని చూసి కలిగిన అసూయ మాత్రమే నని నెమ్మదిగా తన కర్థమైంది.

"వీళ్ళింట్లో నేను భోంచెయ్యను" అని మొండికేసుకుంది సరస్వతి.

అది మర్యాదగా వుండదని నచ్చజెప్పటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు తాను.

సరస్వతి ప్రత్యేకంగా వంట ప్రారంభించింది.

తాను మాత్రం విధిలేక దాన్నే తిన్నాడు.

పాపను కూడా తినమని, తన వదనే వుండమని బలవంతం చేసేది. కానీ ఏనాడూ అది వీలుకాలేదు.

బొంబాయి ప్రయాణం తన కళ్ళు తెరిపించింది.

కుల వ్యవస్థను గురించి తనకున్న అభిప్రాయాలు శిథిలమైపోయి, తాను కళ్లు తెరిచాడు.

కానీ సరస్వతి కళ్ళు మాత్రం పూర్తిగా మూసుకుపోయాయి.

చీటికీమాటికీ కులం పేరెత్తేది.

ఆ ప్రసక్తి వచ్చినప్పుడల్లా రాజేశ్వరమ్మకు బాధగా వుండేది.

చౌదరి విసుక్కునేవాడు.

ఆ విసుగులోంచి క్రమంగా చౌదరిలో కులాభిమానం మొలకెత్త సాగింది.

తాము బొంబాయినుంచి తిరిగొచ్చే ముందు రోజు—

"ఒక్కపూటైనా మా యింట్లో భోజనం చెయ్యండి అక్కయ్యగారూ", అని రాజేశ్వరమ్మ బ్రతిమాలింది.

"అది కుదరదులేమ్మా! ఎంతచెడ్డా మేము యింకా మాంసం తినే స్థితికి రాలేదు". అన్నది సరస్వతి.

"అయ్యయ్యో! మీ పాప మా యింట్లో అడుగుపెట్టిన రోజే మా యింట్లో మాంసం తినటం మానేశాము. నేను వంటచెయ్యను. వంట బ్రాహ్మల్నిపెట్టి చేయిస్తాను. మా యింట్లో ఒక్కపూట భోంచెయ్యండి. కాదనకండి", మళ్ళీ బ్రతిమాలింది రాజేశ్వరమ్మ.

"పాపను రేపు నాతో తీసుకెళ్ళాలనుకుంటున్నాను", అకస్మాత్తుగా అన్నది సరస్వతి.

నెత్తిమీద పిడుగుపడ్డట్టు అదిరి పడ్డాడు తాను

రాజేశ్వరమ్మ వలలో చిక్కుకున్న పావురంలా భయంగా చౌదరి కేసి చూసింది.

"తప్పకుండా తీసుకెళ్ళండి", నరికినట్టుగా అన్నాడు చౌదరి.

కానీ పాపమాత్రం రాలేదు.

సరస్వతి సర్వప్రయత్నాలూ చేసింది.

కానీ పాప మాత్రం రానంటే రానంది.

తానే కన్నతల్లినని చెప్పగలిగిన ధైర్యం తనకు లేకపోయినందుకు తన్నుతాను తిట్టుకుంది సరస్వతి.

కళ్ళు తెరిచిన తాను, కళ్ళు మూసుకుపోయిన సరస్వతి మళ్ళీ మదనపల్లె చేరుకొన్నారు.

బొంబాయిలో పాప పెరగసాగింది.

కొంతకాలం యింట్లో. మరికొంత కాలం ఆస్పత్రిలో సరస్వతి కృశించి పోసాగింది.

చౌదరి. రాజేశ్వరమ్మ రోజు రోజుకూ తన కంటికి దేవతలుగా కనిపించ సాగారు.

సరస్వతి దృష్టిలో మాత్రం వాళ్ళు తన పాపను దొంగిలించిన దొంగలై పోయారు.

సంవత్సరాలు మెల్లిగా నిద్ర పట్టని రాత్రుల్లా దొర్ల సాగాయి.

సరస్వతికి అకాలంలో వృద్ధాప్యం వచ్చేసింది

తనకు జీవితంమీద విసుగు పెరిగి పోయింది.

పాప మాత్రం చౌదరి రాజేశ్వరమ్మల కూతురుగానే మాకు దూరంగా పెరగసాగింది.

కోపం వచ్చినప్పుడల్లా సరస్వతి పాపను తీసుకు రావాలని ప్రయత్నించేది.

అనేక కారణాలవల్ల అది ఏనాడూ కుదరలేదు.

ఇలా యింతకాలం కదలిపోయింది.

బొంబాయిలో వ్యాపారం మానుకొని చౌదరి చిత్తూరు చేరాడు.

ఆరు నెలలు తిరక్కుండా తన్నుకూడా చిత్తూరికి బదిలీ చేయించాడు. జిల్లా పరిషత్తుగా మారిపోయిన జిల్లా బోర్డులో చౌదరి మాటకు తిరుగులేదు.

చౌదరి బొంబాయిలో వ్యాపారం మానేసి సొంతవూరు చేరటానికి ఒక్కొక్కరో కారణం చెబుతున్నారు.

అతడు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు కావటానికే చిత్తూరు వచ్చాడని కొందరి అనుమానం....

సుమారు పది సంవత్సరాల తరువాత పాపను చూసిన సరస్వతి నోటమాట రాకుండా నిలబడిపోయింది.

చిదిమి పెట్టిన దీపంలా వుంది పాప!

ఇరవై సంవత్సరాలు నిండిన అందంలా. ఆరోగ్యంలా వుంది పాప!

"మన వూళ్ళో అత్తయ్య. మామయ్య వున్నారని చెప్పే వాణ్ణి చూడూ. వారే వీరు!" అని పరిచయం చేశాడు చౌదరి.

సరస్వతి కొరకొరలాడుతూ చూసింది తన్ను.

చౌదరి సరస్వతి చూపులోని తీవ్రతని గమనించాడు.

"నమస్కారం." అన్నది జానకిగా ఎదిగిపోయిన పాప!

తర్వాత టిఫిను. కాఫీ తెచ్చియిచ్చింది.

"నాకొద్దమ్మా. నా కలవాటులేదు" అన్నది సరస్వతి.


ఆంధ్రజ్యోతి పాఠకులకు

మూడు వారాల

మరో చక్కని ప్రేమకథ

'గూడు కోసం'

వర్తమాన రచయిత్రి

శ్రీమతి డి. విజయలక్ష్మి

రచన

త్వరలో ప్రారంభం!


అది గమనించనట్టే తాను మాత్రం టిఫినూ. కాఫీ తీసుకున్నాడు.

ఇల్లు చేరిన తరువాత సరస్వతి మండిపోయింది.

"అలా ఎవరింట్లో అంటే వారింట్లో తినెయ్యడమేనా?" అన్నది కోపంగా.

శానిటోరియం వేపచెట్ల నీడల్లో తన కబ్బిన సుగుణం ఓర్పు!

"ఇతరుల యిళ్ళల్లో తింటే లేని తప్పు చౌదరి యింట్లో తింటే వచ్చిందా?" అన్నాడు తాను నవ్వుతూ.

"మాటకు మాట మాట్లాడ్డం వచ్చు యింకేం చేతకాకపోయినా!" జవాబు చెప్పలేని సరస్వతి రోషంతో అన్నది.

'శానిటోరియం వేపచెట్ల నీడల్లో సరస్వతి పోగొట్టుకున్న సుగుణం ఓర్పు!

"ఔను నేను చేతకానివాణ్ణే". అన్నాడు తాను.

"ఇకమీదనైనా కాస్త సమర్థత నేర్చుకోండి. జానకిని నాలుగురోజుల్లో మనింటికి తీసుకురావాలి", ఖండితంగా అన్నది సరస్వతి. ఆ మాట అంటున్నప్పుడు ఆవేశంతో ఆవిడ కంఠం వణికింది.

"అలాగే. చూద్దాం. ఐనా యిరవై సంవత్సరాలు కమ్మవారి యింట్లో పెరిగిన పిల్లను మనం తెచ్చుకొని మాత్రం యేం చేస్తాం?"

"ఏదో ఒకటి చేస్తాం. అసలు చేయటం చేయకపోవటం కాదండి ప్రశ్న. జానకి మనపిల్ల. అది మనింట్లో వుండాలి. అంతే!'

"ఆ సంగతి జానకికి తెలీదుగా. తెలియకుండా తీసుకురావటం ఎలా వీలౌతుంది?" ప్రశ్నించాడు తాను

"దానికి తెలీదండీ! ఆ సంగతి మీరు కూడా మర్చిపోయారండీ! మర్చిపోని దాన్ని నేనొక్కతేనండీ! ఎందుకో తెలుసా?

"నేను కన్నతల్లినండీ!" భోరున ఏడ్చేసింది సరస్వతి.

సరస్వతి దుఃఖం తన ఎదలో ముల్లులా గుచ్చుకుంది.

నిజమే! బిడ్డకు దూరమైన కన్నతల్లి బాధను అర్థం చేసుకోవటానికి తాను ప్రయత్నించలేదేమో అనిపించిందితనకు.

"అలాగే సరస్వతీ. సాధ్యమైనంత త్వరగా తీసుకొస్తాను" అన్నాడు తాను.

"తీసుకురండి. ప్రాయశ్చిత్తం చేయిస్తే తప్ప మన పిల్ల కాదు "

"ప్రాయశ్చిత్తం ఎందుకూ?"

"చేయించాలి మీకు తెలీదు లెండి."

.... .... .... .... .... ....





పూర్తి జీవితానికి అసాధారణమైన బలం

జీవనానికి మరింత కుతూహలాన్ని చేకూర్చిపెడుతుంది. ఒకాసా మీ శరీరంలో బలం, శక్తి తిరిగి సమకూర్చటానికి ఇందు శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలు, 6 ఖనిజములు, 10 అత్యావశ్యకమైన విటమినులు, అశ్వగంధ, యొహింబైన్ వంటి మొక్కల సారములు ఇమిడి వున్నాయి. ఒకాసా తీసుకోండి. జీవితం ఆనందమయమౌతుంది.

ఇప్పుడు అనువైన కొత్త ప్యాక్‌లో

ఒకాసా

పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాలలోనూ దొరుకుతుంది.

ఒకాసావారి ఉచిత పుస్తకంకోసం వ్రాయండి!

OKASA CO. PVT. LTD.
P.O.Box No. 396, Bombay-400 001.

037

ఆ రోజు రాత్రి శూన్యంగా చూస్తూ పడుకొనివుంది సరస్వతి. ఆవిడ చూపు ఎక్కడా ఆనటంలేదు. కానీ కదలటం లేదు. ఆవిడకు అర్థంకాని అనుబంధంలా లోతుగా వుంది. విచిత్రంగా చిక్కు పడిపోయిన ఆవిడ మనస్సులా. మెలివేసుకున్న కనుబొమల్లో ఆవిడ చూపు చిక్కు పడిపోయింది. బయట నిరాశలా వ్యాపించిన చీకటి గదిలో ఆశలా వెలుగుతున్న దీపం. వీటి మధ్య నలిగిపోతున్న సరస్వతి చూపు. పక్కనే ప్రేక్షకుడిలా కూర్చున్న తాను!

తాను మరీ యింత ప్రేక్షకుడిలా వుండిపోవటం న్యాయమా అని ఆలోచిస్తూ - చదువుకుంటూ - ఆలోచిస్తూ - వున్నాడు.

ఆలోచన అర్థంకాని చదువులా గజిబిజిగా వుంది.

చదువు స్పష్టతలేని ఆలోచనలా మసకమసకగా వుంది.

సరస్వతి నావైపుకు తిరిగి అలాగే ఏ భావమూలేని చూపు చూస్తూ పడుకుంది.

సరస్వతి తన వైపు చూస్తూవున్నదని తెలుసు. అందుకే ఆవిడ చూపుని తప్పించుకోవటానికి అర్థంకాని చదువు చదువుతూ కూర్చున్నాడు తాను....

"ఏమండీ?" సరస్వతి పలకరించింది. ఆవిడ కంఠం ఆవిడ చూపులాగేవుంది

"ఊఁ...."

"ఉదయం చాలా పిచ్చిగా ప్రవర్తించాను. మీకు కోపం రాలేదు కదూ?"

"లేదు."

"ఎందుకూ?"

"నీమీద నాకు కోపం రాదు."

"ఎందుకూ?"

"నీమీద నాకు కోపం లేదు కాబట్టి." అన్నాడు తాను నవ్వుతూ.

సరస్వతికూడా బలహీనంగా నవ్వింది.

మంచంమీదనుంచి లేచి వచ్చి. పడక కుర్చీ పక్కన కూర్చుంటూ అన్నది

"ఏమండీ, జానకికి అసలు విషయం చెప్పకుండా తీసుకురావడం వీలు కాదు కదూ?"

"కాదు."

"అసలు విషయం చెబితే జానకి నమ్ముతుందంటారా?"

"ఏమో."

"రేపు మీరు జానకిని తీసుకురండి. నెమ్మదిగా నేనే చెబుతాను."

"అలాగే", అన్నాడు తాను.

మరుసటిరోజు—

"అలాగే తీసుకెళ్ళండి", అన్నది రాజేశ్వరమ్మ

చాలా ఆశ్చర్యం కలిగింది తనకు.

"—కానీ ఒక విషయం జాగ్రత్త.



జానకి మా పిల్ల కాకపోయినా మా పిల్లలాగే పెరిగింది. ఈనాడు అసలు విషయం చెప్పి ఆవిడను షాక్ చేయడంవల్ల లాభమేమిటి?" ప్రశ్నించాడు చౌదరి.

"నీకు కన్నమనసు తెలీదు చౌదరీ", అన్నాడు తాను.

"ఎందుకు తెలీదు? బాగా తెలుసు! పిల్లలున్నవాళ్ళకే అది తెలుసనుకోవటం భ్రమ. ఉన్నవాళ్ళకంటే లేనివాళ్ళకే పిల్లల విలువ తెలుసు", అన్నాడు చౌదరి.



అతని కంఠంలో బాధ, చిరుకోపమూ కలిసి పలికాయి.

"ఇప్పుడు పిల్లలులేని వాళ్ళెవరు—మీరా, మేమా?"



నా ప్రశ్న విని ఆశ్చర్యపోయాడు చౌదరి జవాబు అందించమన్నట్టుగ భార్య కేసి చూశాడు

"తీసుకెళ్ళనివ్వండి. జానకి నా కూతురు కాదని. తన కూతురేనని సరస్వతమ్మగారు జానకికి ఎలా నచ్చచెప్పగలరో చూస్తాను"

అన్నది రోషంతో రాజేశ్వరమ్మ.

"నువ్వు నోరు మూయ్యవే పిచ్చి మొగమా. చూడు శర్మా, కన్నతల్లి కన్న తల్లే. పెంచినతల్లి పెంచినతల్లే! అంత మాత్రంచేత పెంచినతల్లి తల్లికాకుండా పోదు. కానీ-నిజం చెప్పటంవల్ల జానకి కన్నతల్లని అంగీకరించలేక, పెంచిన తల్లిని తిరస్కరించలేక పిచ్చిదైపోతుంది. జానకి అలా కావటం నీకిష్టమేనా"

చౌదరి ప్రశ్నకు సమాధానం నా వద్ద లేకపోయింది.

ఇంటికొచ్చి చౌదరి తన్నడిగిన ప్రశ్నను సరస్వతి నడిగాడు తాను. ఆవిడ కూడా నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది.

"పోనీ అసలు విషయం తొందరపడి చెప్పను లెండి జానకిని తీసుకురండి. నాలుగు రోజులు నా వద్ద వుంచుకుంటాను." దీనంగా అడిగింది సరస్వతి.

ఒకటికి పదిసార్లు నచ్చజెప్పిన మీదట రెండు రోజుల తరువాత రాజేశ్వరమ్మ జానకిని పంపింది.

"సరస్వతమ్మగారు నిన్ను నాలుగు రోజులు తన దగ్గరుంచుకోవాలట. వెళ్ళిరామ్మా." అన్నది రాజేశ్వరమ్మ

"ఎందుకూ?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది జానకి.

"ఆవిడకు పిల్లలు లేరుగా! నిన్నే తన కూతురనుకొని నాలుగు రోజులు సంతృప్తి పడుతుందిట."

ఆ మాట రాజేశ్వరమ్మ ఏ వుద్దేశంతో అన్నదోగాని, సరస్వతి వినివుంటే ప్రళయమే అయ్యేది.

"ఓ ఎస్! అలా ఎందరనుకున్నా మనకేం అభ్యంతరం లేదు ఇప్పుడే వస్తాను మామయ్యా. మీవాళ్ళు పులిహోర బాగా చేస్తారట. చేయించి పెడతారుగా", అన్నది జానకి నవ్వుతూ.

నవ్వుతూనే తనతో బాటు బయలు దేరింది.


సరస్వతికి జానకి తమ యింట్లోవున్న నాలుగు రోజులూ నాలుగు క్షణాలుగా గడచిపోయాయి

అమ్మాయి తిరుగుతుంటే యింటికి ఎంతో కళ వచ్చినట్లనిపించింది.

సరస్వతిని చూస్తే యిరవై సంవత్సరాలుగా ఎండిపోయి ఒక్కసారిగా నిలువెల్లా చిగురించిన చెట్టు జ్ఞాపకంవచ్చింది.

"ఉల్లిపాయలు లేని వంటకు రుచెక్కడిదత్తయ్యా", అని జానకి అంటే- మొట్ట మొదటిసారిగా తమ యింట్లోకి వుల్లి పాయలు వచ్చాయి.

"నువ్వుకూడా తినత్తయ్యా." అని జానకి బలవంతం చేస్తే- పొంగి వస్తున్న



ఇటీవల విజయవాడలో "నవభారతి" సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కథా రచయితల సమ్మేళనం జరిగినప్పుడు సమ్మేళన ప్రారంభకులు శ్రీ సంజీవదేవ్ ప్రసంగిస్తున్న దృశ్యం. ప్రక్కనున్నవారు సాహిత్యవేదిక ప్రారంభకులు డా॥ దాశరధి (ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి), సభాధ్యక్షులు ప్రొ॥ బి. రామరాజు (ఉస్మానియా విశ్వవిద్యాలయ- ఆంధ్ర శాఖాధ్యక్షులు), ఆహ్వాన సంఘ గౌరవాధ్యక్షులు సర్దార్ బయన వీరరాఘవరావు

వాంతిని ఆపుకుంటూ పుల్లిపాయ నోట్లో వేసుకుంది సరస్వతి.

జానకిని చూసి ఎంత మురిసిపోయిందో. జానకి తనకు కొనిచ్చిన పట్టుచీరని చూసి కూడా అంతే మురిసిపోయింది సరస్వతి. నాలుగురోజుల తరువాత—

రాజేశ్వరమ్మకు జ్వరం వచ్చిందని వాళ్ళ నౌకరు వచ్చాడు.

క్షణంలో బయలుదేరి వెళ్ళిపోయింది జానకి

మళ్ళీ ఆరిపోయిన దీపంలా అయిపోయింది సరస్వతి....

"ఈ నాలుగు రోజులూ పూర్తిగా నన్ను మర్చిపోయావు. చూడు - ఎలా అయిపోయానో," అన్నాడు తాను నవ్వుతూ.


"అమ్మాయొచ్చింది గదండీ." అన్నది సరస్వతి ఉత్సాహంగా.

"అమ్మాయొస్తే వచ్చిందిగానీ నీ కులం మాత్రం పోయింది."

సరస్వతి కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి

"నా కులమా ?" అని ప్రశ్నించింది.

"లేకపోతే నా కులమా ? నా కులం ఎప్పుడో పోయింది."




"నా కులం ఎలా పోయిందండీ ?" అన్నది సరస్వతి. కులం పోయే వస్తువు కాదన్న ధీమాతో.

"జానకిని వంటింట్లోకి, ఆమాటకొస్తే దేవునింట్లోకి రానిచ్చావు. దానితో కలిసి తిన్నావు- పుల్లిపాయలు కూడా...."

సరస్వతి ముఖం రోషంతో ఎర్రబారింది.

"అసలు ప్రాయశ్చిత్తం కూడా చేయించకుండా జానకిని ఎలా రానిచ్చావు? దాన్తోబాటు పుల్లిపాయలు ఎలా తిన్నావు? జానకి సంగతి యేమిటోగానీ ముందు నీకు చేయించాలి - ప్రాయశ్చితం!"

"నాకూ, నా కడుపున పుట్టిన పిల్లకూ ఎందుకండీ ప్రాయశ్చిత్తం?"

"నాకేం తెలుసు? నువ్వేగా అన్నావు - జానకికి ప్రాయశ్చిత్తం చేయించాలని."

"నేనా? ఎప్పుడండీ అన్నాను?"

ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తి గడ్డిపోచను పట్టుకున్నట్టుగా, సరస్వతి అబద్ధాన్ని పట్టుకుంది.

అబద్ధానికీ, సరస్వతికీ చుక్కెదురు.

మళ్లెతీగమీద గడ్డిపూవులా సరస్వతికి అబద్ధం అతకలేదు.

సరస్వతి ముఖం చూస్తే నవ్వొచ్చింది తనకు.

బిగ్గరగా నవ్వాడు తాను.

సరస్వతి ముఖం చిన్నబోయింది. కన్నీళ్ళు పొంగి వచ్చాయి.

తనమీద తనకే కోపం వచ్చింది.

ప్రేమగా సరస్వతి దగ్గరికి వెళ్ళి కన్నీళ్ళు తుడవబోయాడు.

బావురుమంది సరస్వతి........

రామశర్మ భార్యవైపు చూశాడు. సరస్వతమ్మ అలాగే పడుకునివుంది.

బాధతో ఆవిడ కనుబొమ్మలు ముడిపడి వున్నాయి.

పాలిపోయిన పెదవులు స్థిరంగా బిగుసుకున్నాయి. కలతగా ఒక వైపునుంచీ మరో వైపుకు పొర్లింది సరస్వతమ్మ.

ఆవిడ కలవరించిన మాటలు రామశర్మకు అర్థం కాలేదు.

నిశ్శబ్దంగా వెళ్ళి పడుకోబోయాడు రామశర్మ.

మంచం రామశర్మ అంతరాత్మలా మూలిగింది

"ఏమండీ, మీరింకా పడుకోలేదూ ?" మగతగా ప్రశ్నించింది సరస్వతమ్మ.

"పడుకుంటున్నా...."

"ఇందాకా ఏం చేస్తున్నారు ?"

"చదువుకుంటున్నా." అన్నాడు రామశర్మ.

సంప్రదాయ మాధుర్యం

**మందార మకరందాలు**

శ్లో॥ యాత్యధో ధోవ్రజత్యుచ్చైర్నరః స్వైరేవ కర్మభిః।
కూపస్య ఖనితాయద్వ త్ప్రాకారస్యేవకారకః॥

మనుష్యులు తమ తమ చేతలవల్లనే అధోగతికో, ఉన్నతికో పోతుంటారు. బావి తవ్వేవాడు లోలోపలికీ, గోడ కట్టేవాడు పైపైకీ పోవడం చూస్తున్నాంగదా!

"ఎప్పుడూ చదువు....చ... దు....వు."
మళ్ళీ నిద్రలోకి జారుకుంది సరస్వతమ్మ.

భార్యముఖాన పడుతున్న దుంగుపల్ని సర్ది పడుకొని నిద్రకోసం ప్రయత్నించ సాగాడు రామశర్మ.

* *

వాకిట్లో గుర్రంబండి నిలిచిన శబ్దం విని వంటింట్లోంచి బయటికి వచ్చింది సరస్వతమ్మ. బండి దిగుతున్న రాజేశ్వరమ్మను చూసి ఆశ్చర్యపోయింది.

"నమస్కారం అక్కయ్యగారూ!" అన్నది రాజేశ్వరమ్మ.

సరస్వతమ్మ జవాబు చెప్పలేదు మూల వున్న చాప పరిచి, "కూర్చో", అన్నది ముభావంగా.

"మీరూ కూర్చోండి." అన్నది రాజేశ్వరమ్మ, తానూ కూర్చుంటూ.

"వీలుకాదు నేను మడి కట్టుకు వున్నాను. ఇంకా వంటకాలేదు." అన్నది సరస్వతమ్మ.

రాజేశ్వరమ్మకు మనస్సు చివుక్కుమంది. మనసులో గుచ్చుకున్న సరస్వతమ్మ మాటను పెరికివేయటానికి చిరునవ్వు నవ్వింది రాజేశ్వరమ్మ.

సరస్వతమ్మ వంటింట్లోకి వెళ్ళి, ఒక పీట తెచ్చుకొని దూరంగా వేసుకొని కూర్చుంది.

ఒక నిముషంపాటు యిద్దరూ మాట్లాడలేదు. ఇద్దరికీ యిబ్బందిగా వున్నా నిశ్శబ్దం చివరికి సరస్వతమ్మ వల్ల చెదిరిపోయింది.

"ఏమిటిలా వచ్చేశావు - పేదవాళ్ళింటికి?" అన్నది సరస్వతమ్మ.

"పిల్లలు లేని నేనే నిజమైన పేదరాల్ని."

"అందుకేగా నాకున్న ఒకే ఒక పిల్లని తీసుకెళ్ళిపోయి, తిరిగి యివ్వనంటున్నావు."

రాజేశ్వరమ్మ జవాబు చెప్పలేదు. సరస్వతమ్మ కోపంగా వుందని అర్థం చేసుకొని నిశ్శబ్దంగా వుండిపోయింది.

"అది సరేగాని, యిప్పుడెందుకొచ్చినట్టు?" మళ్ళీ ప్రశ్నించింది సరస్వతమ్మ

"పాప పెళ్ళి సంగతి మాట్లాడదామని వచ్చానక్కయ్యా." అన్నది రాజేశ్వరమ్మ

"ఓహో...."

పొంగివచ్చిన కోపాన్ని చాలా కష్టం మీద మింగేస్తూ అన్నది రాజేశ్వరమ్మ—

"మొన్నీ మధ్య పాపకొక సంబంధం చూశామక్కయ్యా. అబ్బాయి ఎమ్. ఎ. వరకూ చదువుకున్నాడు యూనివర్సిటీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. మంచి సంప్రదాయమున్న కుటుంబం అంతే కాకుండా బాగా వున్న వాళ్ళు అబ్బాయి నాన్నగారు గొప్ప పలుకుబడి ఉన్న వ్యక్తట ఆ విషయాన్ని గురించి మీతో మాట్లాడుదామని వచ్చాను."

"అంతా పూర్తయిపోయిన తరువాత మాట్లాడటానికేముందీ?"

"ఇంకా ఏమీ కాలేదక్కయ్యా వాళ్ళు అమ్మాయిని చూట్టానికి ఆదివారంనాడు వస్తామన్నారు. మీరు ఒప్పుకోంది సంబంధం ఎలా కుదురుతుంది?"

"ఎందుకు కుదరదు?"

"కన్నతల్లి మీ అనుమతి లేకుండా ఎలా కుదురుతుంది?"

"ఓహో! అలాగైతే నేను జానకి కన్నతల్లినని నీకు జ్ఞాపకం వుందన్న మాట." అన్నది సరస్వతమ్మ కోపంగా పైకి లేస్తూ.

రాజేశ్వరమ్మకు ఓపిక పోయింది.

"శుభమా అని అమ్మాయి పెళ్ళి సంగతి మాట్లాడాలనివస్తే అలాంటి మాటలంటారేమిటక్కయ్యా?" ఎంత స్వాధీనంలో ఉంచుకుందామన్నా రాజేశ్వరమ్మ కంఠం కాస్తబొంగురుబోయింది.

యద్దనపూడి సులోచనారాణి
MSCO
పుస్తకోత్సవం
డ్రా తేది: 17-2-79
పుస్తకోత్సవ కాల పరిమితి 14.1.1979 నుండి 17.2.1979 వరకు పొడిగించబడింది!
ఈ పుస్తకోత్సవంలోని పుస్తకాలు ప్రముఖ చిత్రకారుడు బాపు ప్రత్యేకంగా వేసిన ముఖచిత్రాలతో యం. శేషాచలం అండ్ కో వారు సరికొత్తగా ప్రచురించిన శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి రచనలు!
పుస్తకోత్సవకాల పరిమితిలో, అంటే 17, ఫిబ్రవరి, 1979 లోపు, కొనే ప్రతి పుస్తకంలోను ఒక గిఫ్ట్ కూపన్ వుంటుంది. 17-2-79 న శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి డ్రా నిర్వహిస్తారు!
లక్కీ డ్రా లో
మొదటి బహుమతి : రూ 500
రెండవ బహుమతి : రూ. 300
మూడవ బహుమతి : రూ. 200
ఇవికాక మరో 20 అదనపు బహుమతులు రూ. 50 చొప్పున.
కొనండి! అదృష్టపు పోటీలో పాల్గొని బహుమతులు పొందండి!
వివరాలకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-500 003

# ఆనందమార్గం

(ఒకానొక పరంధామయ్యకు చెందిన పెద్ద కేసును పరమేశ్వరరావనే ఒక లాయరు తన శక్తి యుక్తులన్నీ ప్రయోగించి గెలిపించాడు. తన కేసును నెగ్గించిన లాయరుకు ప్రతిఫలంగా ఒక పది రూపాయల నోటుతీసి లాయరుగారి టేబిలుమీద పెట్టాడు పరంధామయ్య.)

లాయరు : ఏమయా ! ఈ పది రూపాయలు నా గుమస్తాకి మామూలా, మా కారు డ్రయివరుకు పారితోషికమా లేక నాకు ఫీజా?

పరంధామయ్య : అదేమిటండీ అలా అంటారు. మీ ముగ్గురికీ కలిపే ఇచ్చాను తీసుకోండి

★

(ఒక పేరుమోసిన ప్లీడరు దగ్గరకు ఒక క్లయింటువచ్చి తన తరఫున వాదించమన్నాడు)

ప్లీడరు : సరే నీ కేసును తీసుకుంటాను. కానీ దీనికి చాలా ఖర్చవుతుంది. ఆ ఖర్చంతా భరించడానికి నీవద్ద ఏముంది?

క్లయింటు : నావద్ద 1969 మోడల్ ఫోర్డు కారు వున్నది. దాన్ని అమ్మివేసైనా మీ ఫీజు ఇచ్చుకుంటాను. మీరు సందేహించకండి.

ప్లీడరు : ఆల్‌రైట్, అయితే నీ కేసేమిటి?

క్లయింటు : అదే నావద్ద వున్నదని చెప్పానే అరవై తొమ్మిది మోడల్ ఫోర్డు కారు. దాన్ని నేను దొంగిలించానని అభియోగం.

★

మూడోసారి దొంగతనం చేసి కోర్టుకి వచ్చాడు ఒక కుర్రాడు. ఆ కుర్రవాడి తండ్రి కూడా వచ్చాడు. కోర్టుకి మేజిస్ట్రేటుగారు ఆ కుర్రవాని తండ్రినుద్దేశించి.

మేజిస్ట్రేటు : ఏమయ్యా నీ కొడుకు దొంగతనం చేసి నాముందుకు రావటం ఇది మూడో సారి. పోనీ తండ్రివైనందుకు నువ్వయినా అతన్ని తిర్చిదిద్ది సరైనదార్లో పెట్టలేక పోయావా?

తండ్రి : చిత్తం! వాణ్ని సరైనదార్లో పెట్టడానికి నానా తంటాలు పడ్డానండి. కాని కుర్రవెధవ ఎప్పుడూ కొట్టేసిన వస్తువుతోసహా దొరికిపోతున్నాడండి.

—ఈదుపల్లి వెంకటేశ్వరరావు, ఏలూరు

"అసలు జానకిపెళ్ళి చెయ్యటానికి ఎవరిచ్చారు నీకీ అధికారం?" సరస్వతమ్మ ప్రశ్నించింది.

"నాకండలు కరిగిపోయేలా చాకిరీ చేసి జానకిని పెంచిపెద్దను చేసిన తల్లిని. నాకు అధికారం మరొకరు యివ్వాల్సిన పని లేదు." అన్నది రాజేశ్వరమ్మ.

"ఆమాట నేను చచ్చిపోయిన తరువాత అందువుకానీ. నేనింకా బ్రతికేవున్నాను."

"నేనుకూడా బ్రతికేవున్నాను కన్నంత మాత్రానికే పాప మీ సొంతం అయిపోలేదు. ఇరవై సంవత్సరాలు నా రక్తం ధారపోసి పెంచి, పెద్దదాన్ని చేశాను. దానిపెళ్ళి నేనుకాక యింకెవరు చెయ్యాలి మేము తెచ్చినంత మంచి సంబంధం తేగలరా మీరు. జానకి పెళ్ళి మీకొదిలేస్తే ఏ గుమాస్తా పెళ్ళాంగానో దాని బ్రతుకు తెల్లవారుతుంది. కన్నతల్లివి కదా అనే మర్యాదకు మిమ్మల్ని అడగటానికి వచ్చాను. మట్టు మర్యాద లేకుండా నోరు పారేసుకుంటే వింటానికి నేను మీ పనిమనిషిని కాను." విసురుగా అన్నది రాజేశ్వరమ్మ.

సరస్వతమ్మకు భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి.

నోట మాట రాలేదు.

తన అశక్తతను తలుచుకొని కన్నీళ్ళు పొంగి వచ్చాయి.

"మాడండీ- ఆదివారం అమ్మాయిని చూట్టానికివస్తున్నారు. మీకు యిష్టముంటే రండి. లేకుంటే మానేయండి. నా బాధ్యతగా నేను చెప్పాను. తరువాత మీ యిష్టం." రాజేశ్వరమ్మ బయలుదేరింది.

ఎంత నిగ్రహించుకుందామన్నా సరస్వతమ్మకు దుఃఖం ఆగలేదు

"ఈ పెళ్ళికి నేను బ్రతికుండగా ఒప్పుకోను. మా చిన్నాన్న కొడుకొకడున్నాడు. వాడూ లెక్చరరే! నేను నోరు తెరిచి అడిగానంటే జానకిని కళ్ళ కద్దుకొని చేసుకుంటాడు. నా కూతురి పెళ్ళి నేనే చెయ్యాలి నువ్వు.... నువ్వు చెయ్యటానికి నేను చచ్చినా ఒప్పుకోను...."

"నేను పెంచిన నీ కూతుర్ని పెళ్ళాడటానికి సిద్దపడే బ్రాహ్మడు దొరికిన రోజు చూద్దాం ఆ సంగతి" విసురుగా బయటికి వెళ్ళిపోయింది రాజేశ్వరమ్మ.

గాలికి విరిగిపోయిన కొమ్మలా సరస్వతమ్మ చాపమీద కూలబడిపోయింది.

పది నిమిషాల తరువాత లోపలికొచ్చిన రామశర్మకు వంటింట్లో నుంచి మాడిపోతున్న అన్నం వాసన తలవాకిట్లో కెదురొచ్చింది.

పరుగెత్తుకుంటూ హాల్లోకొచ్చాడు

సరస్వతమ్మ కుప్పకూలగా చాప మీద పడివుంది.

"సరస్వతీ.... సరస్వతీ...." భార్యను లేవనెత్తుతూ అన్నాడు రామశర్మ.

సరస్వతమ్మ తన రెండు చేతులూ భర్త భుజాల మీద వేసి లేచి కూర్చుంది.

రక్తంలేక పాలిపోయిన బుగ్గల మీద కన్నీళ్ళు చారికలు కట్టాయి. ఇరవై సంవత్సరాలు ఆమె ఆరోగ్యంతో దోబూచులాడిన క్షయరోగం లోపలికి లాక్కుపోయిన కళ్ళు వుబ్బివున్నాయి ఎర్రగా కమిలిపోయిన కనురెప్పలు కన్నీటితో తడిసిపోయాయి ఊపిరాడనంత త్వరత్వరగా వెక్కిళ్ళు వస్తున్నాయి. ఎముకల గూడులావున్న సరస్వతమ్మను వెక్కిళ్ళు కదలించి వేస్తున్నాయి. భార్య ఆకారాన్ని చూసిన రామశర్మ. భయపడిపోయాడు....

"ఏమండీ..యీ పెళ్ళికి నేను చచ్చినా.. ఒప్పుకోను." వెక్కిళ్ళ మధ్యలోంచి అన్నది సరస్వతమ్మ.

"ఏ పెళ్ళి?" రామశర్మ బుద్ధి ఒక క్షణం పనిచెయ్యలేదు.

సరస్వతమ్మ చూపులు కత్తుల్లా మెరిశాయి.

ఆ చూపు గుచ్చుకున్న రామశర్మ బుద్ధి మేల్కొంది.

"ఓ, జానకి పెళ్ళికదూ?" అన్నాడు.

"ఔను....నా కూతుర్ని నా తమ్ముడికే యివ్వాలి....నా కూతురి పెళ్ళి చెయ్యటానికదెవరండి....ఆ రాజేశ్వరి....ఇంత బ్రతుకూ బ్రతికి.... నాబిడ్డ సూద్రుణ్ణి పెళ్ళి చేసుకోవటానికి వీల్లేదు."

"ఔను," అన్నాడు భార్యను బాగా అర్ధం చేసుకున్న రామశర్మ.

ఈ రోజే మా తమ్ముడికి వుత్తరం రాస్తాను." ఉద్రేకంతో కళ్ళు తుడుచుకుంటూ లేచింది సరస్వతమ్మ.

భార్యనే కాకుండా లోకాన్ని కూడా కొంచెం అర్ధం చేసుకున్న రామశర్మ తనలోతాను నవ్వుకున్నాడు....

(ఇంకా వుంది)

